క్లుప్తంగా

ఊనగట్లలో అయ్యప్పల గ్రామోత్సవం



గ్రామోత్సవంలో అయ్యప్ప మాలధారులు

చాగల్లు: మండలంలోని ఊనగట్ల గ్రామంలో అయ్యప్ప మాలధారులు ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో సందడిగా గ్రామోత్సవం సాగింది. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులు కలశపూజ, పడిపూజ నిర్వహించారు. స్వామివారికి పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామంలోని అన్ని ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ నెల 13న ఇడుములు ధరించి శబరిమాల పయనమవుతామని అయ్యప్ప మాలధారులు తెలిపారు.

కోటసత్తెమ్మ వారికి ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయానికి ఆదివారం భక్తులు తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా రూ.90,464 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలంగిలో సూర్య నమస్కారాలు కుంకుమార్చనలు

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి గ్రామంలో జరుగుతున్న ఆప్త వాజపేయం యాగంలో భాగంగా స్మార్త యాగశాలలో ఆదివారం పాశుపత రుద్రాభిషేకం, సూర్య నమస్కారాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు సూర్య భగవానుని అనుగ్రహం కోసం, ఆరోగ్యప్రాప్తి కోసం ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు జంధ్యాల సుబ్రహ్మణ్య శ్రీనివాస శర్మ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు సౌర రుద్ర హోమం, చండీ హోమాలతో పాటు 6 గంటల నుంచి భక్తులతో 365 వత్తులతో కోటి దీపోత్సవం నిర్వహించారు. ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా శివ కల్యాణం నిర్వహించారు.

మేనేజర్ వైఖరికి నిరసనగా ఆర్టీసీ కార్మికుల ధర్నా



కొవ్వూరులో ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

కొవ్వూరు: నరసాపురం రూట్‌లో సిబ్బంది మార్పుల విషయంలో కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వైఖరిని నిరసిస్తూ స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం గేట్ మీటింగ్ నిర్వహించి, మేనేజర్ వైఖరి పట్ల నిరసన వ్యక్తం చేశారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) డిపో కార్యదర్శి ఎం.శివకుమార్ మాట్లాడుతూ ఎనిమిది రోజుల నుంచి పలుమార్లు వినతిపత్రాలు, నోటీసు ఇచ్చామన్నారు.అయినప్పటికీ డీఎం ఏక పక్షంగా వ్యవహరిస్తూ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో అధికారి స్పందించకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.కమిటీ సభ్యులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

లూథరన్ చర్చిలో కోత పండగ



లూథరన్ చర్చిలో కోత పండగ నిర్వహిస్తున్న క్రైస్తవ మహిళలు

నిడదవోలు: స్థానిక రాయిపేటలోని మెంటే సుందరరావు మెమోరియల్ టౌన్ లూథరన్ చర్చిలో చైర్‌పర్సన్ మెంటే దయరాజగిరి ఆధ్వర్యంలో ఆదివారం కోత పండుగ నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ కె. కమలాకర్ మాట్లాడుతూ తమ జీవితంలో క్రైస్తవులు కృతజ్ఞత కలిగి ఉండడం అనే సుగుణాన్ని అలవరుచుకోవాలన్నారు. ప్రథమ ఫలాలను దేవునికి కృతజ్ఞతా పూర్వకంగా అర్పించాలన్నారు. కోత పండుగను పురస్కరించుకుని చర్చి వద్ద వివిధ ఆహార పదార్థాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. వాటిని విక్రయించగా వచ్చిన ఆదాయాన్ని దేవునికి కృతజ్ఞత కానుకగా సమర్పించారు. మహిళా విశ్వాసులు స్తుతి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో బేబీ కమలాకర్, రాజ్యలక్ష్మి, సునీత, అభి, జ్ఞానకుమారి, భాగ్యవతి, రామలక్ష్మి, జ్యోతి, బేబీ ప్రకాష్, బేబీ, పిల్లి కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాగు మురుగు సమస్య తీరేనా?

- డీఎంఎఫ్ నిధులు రూ.1.09 కోట్ల మంజూరు
- పనులు ప్రారంభం కాక టెండర్ రద్దు
- చేసిన మేర పనులకు చెల్లించని బిల్లులు
- దేవరపల్లి వాసులకు తొలగని డ్రైనేజీ సమస్యలు



దేవరపల్లిలోని మురుగు నీటి డ్రైనేజీ



వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అసంపూర్తిగా మిగిలిన డ్రైనేజీ నిర్మాణం (ఫైల్)

దేవరపల్లి: దశాబ్దాలుగా దేవరపల్లి వాసులను పట్టి పీడిస్తున్న ఇసుక వాగు డ్రైనేజీ పనులకు మళ్లీ బ్రేక్ పడింది. ఈ డ్రైనేజీ నిర్మాణానికి గతంలోనే నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పిలవడంలో జాప్యం, దాఖలైన టెండర్లు రద్దు కావడం వంటి కారణాలతో రెండేళ్లుగా పనులు నిలిచిపోయాయి. దీంతో ఈ సమస్య పరిష్కారం అవుతుందో? లేదోనని స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. దేవరపల్లి గ్రామ నడిబొడ్డున ఇసుక వాగు ఉంది. పొంగుటూరు, యాదవోలు, చిన్నాయగూడెం ప్రాంతాల నుంచి వర్షా కాలంలో వచ్చే వర్షపు నీరు ఇసుక వాగు ద్వారా దేవరపల్లి ఊర చెరువులో చేరుతుంది.అక్కడి నుంచి దిగువ ప్రాంతాల మీదుగా కాపవరం వద్ద గల రాళ్లమడుగులో కలుస్తోంది. తుపానులు, భారీ వర్షాలపుడు రెండు, మూడు రోజుల పాటు ఇసుక వాగు ఉధృతంగా ప్రవహించేది. అయితే తాడిపూడి కాలువ నిర్మాణంతో ఈ వాగుకు వచ్చే వరద పూర్తిగా తగ్గింది. దరిమిలా ఈ వాగు మురుగునీటి కాలువగా మారింది. వాగులో మురుగునీరు నిండి ఉండడంతో పరిసర వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

సుమారు 25 ఏళ్ల క్రితం అప్పటి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఇమ్మణ్ణి రాజేశ్వరి ఇసుక వాగును పరిశీలించి ఇరువైపులా గోడల నిర్మాణానికి సుమారు రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో వాగుకు ఇరువైపులా గోడలు నిర్మించారు. అయితే వంతెన వద్ద నుంచి ప్రధాన రహదారికి అనుకుని ఉన్న వాగు పూర్తిగా ఆక్రమణలకు గురవడంతో వాగులోని మురుగు నీరు దిగువకు కదలడం లేదు. మురుగునీటి వల్ల దోమల బారినపడి పరిసర వాసులు రోగాల బారిన పడుతున్నారు. ఇసుక వాగులో పేరుకుపోయిన పూడికను తీసి, అభివృద్ధి చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు గతంలో పాలకులు, అధికారులను కోరారు. దీంతో 2021–22లో అప్పటి గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఈవాగును పరిశీలించి శాశ్వత పరిష్కారంలో భాగంగా ఇరువైపులా గల గోడల ఎత్తు పెంచి, అడుగున సిమెంట్ కాంక్రీట్, పై భాగంలో శ్లాబ్ వేసేలా అధికారులతో ప్రతిపాదనలు తయారు చేయించి ప్రభుత్వానికి పంపారు.

రెండు సార్లు నిధుల మంజూరు

వాగుపై డ్రైనేజీ నిర్మించి, అభివృద్ధి చేయడానికి రూ.80 లక్షలు మంజూరు చేస్తూ అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం కరోనా విజృంభించడంతో టెండర్లు పిలవకపోవడంతో నిధులు రద్దయ్యాయి. ఇదే పనికి 2023–24లో జిల్లా మైనింగ్ నిధులు రూ.1.09 కోట్లు మంజూరు చేస్తూ అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో రూ.80 లక్షలు ఇసుక వాగు డ్రైనేజీ, అభివృద్ధి పనులకు, మిగిలిన రూ.29 లక్షలు వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వాగుపై వంతెన, ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణానికి కేటాయించారు. టెండర్లు ఖరారు కావడంతో సుమారు ఏడాది క్రితం వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆ పనులు పూర్తికాగా అధిక వర్షాల వల్ల రక్షణ గోడల నిర్మాణ పనులు మాత్రం ఆగిపోయాయి. ఇసుక వాగు పనుల టెండర్ రద్దు కావడంతో మంజూరైన నిధులను ఇటీవల ప్రభుత్వం రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు.

ప్రారంభం కాని పనుల నిలుపుదల

"గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనప్పటికీ పలు గ్రామాల్లో పనులు ప్రారంభించలేదు. ఈ పనులను ప్రభుత్వం రద్దు చేసింది. ప్రారంభించిన పనులు పూర్తి చేస్తాం. ఇసుకవాగు పనులు నిలిచిపోయాయి. నిధులు రద్దయ్యాయి. మరలా కొత్తగా నిధులు మంజూరు కావలసి ఉన్నాయి. వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద వంతెన నిర్మాణ పనుల వరకు బిల్లు చేసి ప్రభుత్వానికి పంపించాం."

– టీఆర్ఎస్ కుమారి, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, దేవరపల్లి

రూ.5 లక్షలతో పూడికతీత

దేవరపల్లి మండల పరిషత్ నిధుల నుంచి ఎంపీపీ కేవీకే దుర్గారావు ఇటీవల రూ. 5 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో ఇసుక వాగులో పేరుకుపోయిన పూడిక తొలగించారు. అయినా వాగులో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోందని ప్రజలు వాపోతున్నారు. మరోపక్క ఇసుకవాగుపై వంతెన, డ్రైనేజీ పనులకు రూ.29 లక్షలు మంజూరు కాగా, సుమారు రూ.18 లక్షల వ్యయంతో పనులు చేసినట్టు సంబంధిత కాంట్రాక్టర్ తెలిపారు. దీనిలో ఇంతవరకూ ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం తనకు చెల్లించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన పనులకు బిల్లు చెల్లిస్తే మిగిలిన పనులు పూర్తి చేస్తానని ఆయన తెలిపారు.

సంపద కేంద్రం వద్దే కూరగాయల సాగు



ఘంటావారిగూడెంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద సాగవుతున్న కూరగాయలు



కూరగాయలను అధికారులకు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు నాయక్

పంచాయతీ కార్యదర్శి శ్రద్ధతో ఘంటావారిగూడెంలో సాకారం

నల్లజర్ల: నిరుపయోగంగా ఉన్న గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలు మందుబాబులకు అడ్డాలుగా తయారయ్యాయి. మరికొన్ని చోట్ల అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. గ్రామాల్లో సేకరించిన చెత్త నుంచి ఈ కేంద్రాల్లో సంపద (వర్మీ కంపోస్టు) తయారు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. గ్రామాల్లో ఇప్పటికే నిర్మించిన సంపద తయారీ కేంద్రాలను తిరిగి ప్రారంభించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. అయినప్పటికీ ఎక్కడా వర్మీ కంపోస్టు తయారీ జరగడం లేదు. వాటన్నింటికి భిన్నంగా మండలంలోని ఘంటావారిగూడెంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద సేంద్రియ ఎరువులతో కూరగాయలు, ఆకుకూరల సాగు జరుగుతోంది. పంచాయతీ కార్యదర్శి భానోతు వెంకటేశ్వర్లు నాయక్ ఆధ్వర్యంలో ఈ సంపద కేంద్రంలో తయారైన సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలకు మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వోద్యోగులు సైతం ఇక్కడకు వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. వంగ, బీర, టమోట, చిక్కుడు, బెండ, దొండ, తోటకూర, గోంగూర, ఆనబ కాయలు పండిస్తున్నట్టు కార్యదర్శి వెంకటేశ్వర్లు నాయక్ తెలిపారు. ఇక్కడ పండిస్తున్న పంటలను కాపాడేందుకు ఒక కుటుంబానికి ఉపాధి కల్పించేలా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

అన్నింటినీ వినియోగంలోకి తీసుకొస్తాం

మండలంలోని అన్ని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎంపీడీఓ సింహాద్రి తెలిపారు. పాడైన సంపద తయారీ కేంద్రాలకు మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. వాటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు.

జోరుగా ఇసుక మూటల వ్యాపారం

- ఒక్కొక్కటి రూ.50
- డోర్ డెలివరీకి మరో రూ.10 అదనం
- కానూరు అగ్రహారం, ఉసులుమర్రు గ్రామాల్లో విక్రయాలు



కానూరు అగ్రహారంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఇసుక మూటలు

పెరవలి: ఇసుక అక్రమ వ్యాపారం మూడు ట్రాక్టర్లు – ఆరు ఇసుక మూటలు అన్న చందంగా జోరుగా సాగుతోంది. సాధారణంలో వర్షాకాలంలో ఎక్కడా ఇసుక లభ్యం కాదు. కానీ ఇక్కడ మాత్రం ఏడాది పొడవునా ఇసుక లభిస్తోంది. మండలంలోని కానూరు అగ్రహారం, ఉసులుమర్రు గ్రామాల్లో ఇసుక మూటల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఒక్కో ఇసుక మూటను రూ.50 రేటుకు విక్రయిస్తున్నారు. డోర్ డెలివరీ కావలసిన వారు మరో రూ.10 చెల్లించాలి. దాంతో ఇసుక వినియోగదారులు కూడా తమకు ఎంత అవసరమో అంతే కొనుగోలు చేసుకుంటున్నారు. అంతేగాకుండా రీచుల్లో ఇసుక దొరకని వాహనదారులు నేరుగా ఈ ఇసుక మూటలు విక్రయించే వారిని సంప్రదించి వాటినే కొనుగోలు చేసి తీసుకువెళుతున్నారు. ఇసుక డిమాండ్ ఉంటే తమకు 10 రూపాయిలు వస్తాయని, లేకపోతే ఉండదని మూటదారులు చెబుతున్నారు. రాత్రిళ్లు ట్రాక్టర్లపై ఇసుక తెచ్చి ఏటిగట్టపై గుట్టలుగా వేసి పగలు వాటిని బస్తాలుగా కట్టి విక్రయిస్తున్నారు. ఎవరైనా అధికారులు వచ్చి ఇదేమిటని? అడిగితే 'ఇసుక వేసుకున్నాం. పాడైపోతుందని ఇలా మూటలు కట్టాం.' అని సమాధానం చెబుతున్నారు. దాంతో అధికారుల కూడా ఏమీ అనకుండా వెళ్లిపోతున్నారు. ఇలా వారి వ్యాపారం 'మూడు మూటలు– ఆరు కాసులు'గా సాగిపోతోంది.

ఎస్టీ కాలనీలో సీపీఎం ప్రజాపోరు

నిడదవోలు: ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలోని ఎస్టీ కాలనీలో నిర్వహించారు. ఇంటింటికీ సీపీఎం ప్రచురించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు దృష్టికి తీసుకువచ్చారు. ఎస్టీ కాలనీ వారికి సొంత స్థలాలు లేవని, డ్రైనేజీ సక్రమంగా లేనందున తామే పారిశుధ్య పనులు చేసుకుంటున్నామని వివరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసరాల ధరలను కూటమి ప్రభుత్వం నియంత్రించలేదన్నారు. దానికితోడు విద్యుత్ చార్జీల పెంపు వల్ల ప్రజలపై భారం పడుతోందన్నారు. నిబంధనలు పాటించకుండా విచ్చలవిడిగా మద్యాన్ని విక్రయిస్తున్నారని విమర్శించారు. యువత మద్యానికి బానిసలుగా మారడంతో కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయన్నారు. ఉచిత ఇసుక విధానం ఇంకా ఆచరణలోకి రాలేదని విమర్శించారు. కార్యక్రమంలో సుంకయ్య, వెంకన్న, యేసు, దుర్గాప్రసాద్, రాజు పాల్గొన్నారు.

గోకుల కృష్ణ యాదవ సంఘ వన సమారాధన



మంత్రి కందుల దుర్గేష్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న గోకుల కృష్ణ యాదవ సంఘ సభ్యులు



వేములూరు వన సమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

నిడదవోలు: గోకుల కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామ శివార్లలోని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణకు చెందిన తోటలో నిర్వహించిన ఈ వేడుకకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యాదవ సంఘ కుటుంబ సభ్యులు, స్నేహితులు ఉల్లాసంగా గడిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.
సంఘ సభ్యులు మంత్రి దుర్గేష్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, రాష్ట్ర యాదవ సంఘ ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు చావల సూర్యచంద్రం, గోకుల కృష్ణ యాదవ సంఘ అధ్యక్షుడు గంగుల గోపి యాదవ్, కార్యదర్శి గుడ్ల సతీష్, కౌన్సిలర్లు ఎస్కే వజీరుద్దీన్, కారింకి నాగేశ్వరరావు, మద్దిపాటి నాగశ్రీ , మానుపాటి లక్ష్మి ,సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వేములూరులో కార్పెంటర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

కొవ్వూరు: వేములూరు గ్రామంలో ఆదివారం కొవ్వూరు విశ్వేశ్వర కార్పెంటర్స్, వర్కర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్తిక వన సమారాధన ద్వారా కార్పెంటర్లు అందరినీ కలుసుకునే అవకాశం కలిగిందన్నారు. కార్పెంటర్స్‌కు అవసరమైన తోడ్పాటు అందిస్తామన్నారు. విశ్వేశ్వర కార్పెంటర్స్, వర్కర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పలపాల సూర్యచంద్రరావు, ఉపాధ్యక్షుడు మారోజు నరసింహ మూర్తి, కార్యదర్శి మారోజు సూర్యనారాయణ, కోశాధికారి సివిలి సత్య శివకుమార్, పట్నాల వెంకటరత్నం, నియోజకవర్గ టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, దాయిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి సూక్తులు యువతకు ఆదర్శం



భక్తి సమ్మేళనం కార్యక్రమానికి హాజరైన భక్తులు

- పలువురు స్వామీజీల ఉపదేశం
- ముగిసిన శ్రీ రామకృష్ణ– వివేకానంద భావ ప్రచార పరిషత్ భక్తి సమ్మేళనం

నిడదవోలు: వివేకానందుడి సూక్తులు యువతకు ఆదర్శనీయమని, మీరు ఏమనుకుంటారో అదే అవుతారు. మిమ్మల్ని మీరు బలహీనంగా భావిస్తే మీరు బలహీనులవుతారు. అదే మీరు మిమ్మల్ని బలవంతులుగా భావిస్తే మీరు బలంగా మారతారు అంటూ పలువురు స్వామీజీలు ఉపదేశించారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధ్యాంధ్ర శ్రీ రామకృష్ణ– వివేకానంద భావ ప్రచార పరిషత్ ఐదో భక్తి సమ్మేళనం సభలు మూడో రోజు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ముఖ్య ప్రసంగీకుడు సన్యాసానంద మహరాజ్ మాట్లాడుతూ స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంసల సందేశాలను ప్రపంచమంతా చాటుతున్నట్టు ముందుగా శారదాదేవి స్వప్నంలో చూశారన్నారు. భక్తి శ్రద్ధలు ఉంటే మన సాధనలో జప,తపాలు చేసుకోవడానికి సమయం దొరుకుతుందన్నారు. దేశంలో 200కి పైగా రామకృష్ణ మఠాలు రావడానికి శారదాదేవి ప్రార్థనే కారణమన్నారు. స్వామీజీలు అక్షరాత్మానందాజీ, సుకృతానందాజీ, అనుపనందాజీ, బోధమయానందాజీ, వినిశ్చలానందాజీ, స్వసంవేద్యానందాజీ, శతికంఘానందా మహరాజ్, పరిజ్ఞేయానందా మహరాజ్‌లు ప్రసంగించారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు ఎస్.రాంబాబు, కార్యదర్శి పి.సాగరం, స్వామీజీలు, మాతాజీలు, రామకృష్ణ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

చాగల్లు: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పిరమిడ్ సీనియర్ మాస్టర్ పి.కనకరాజు అన్నారు. మండలంలోని ఎస్. ముప్పవరంలోని పరమాత్మ పిరమిడ్ వద్ద ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. నిడదవోలు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కనకరాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మనిషిగా మన గురించి మనం తెలుసుకోవాలంటే ధ్యానం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ధ్యానంతో బుద్ధి కుశలత ఆధ్యాత్మిక జ్ఞానం పెరుగుతుందన్నారు. ధ్యానం వలన శారీరక, నాడీమండల శుద్ధి కలుగుతుందన్నారు. నిడదవోలు పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎంఏ ప్రసాద్ మాట్లాడుతూ ధ్యానం చేసిన వారు ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో జి.తాతారావు, అల్లు సత్యనారాయణ, బి.సత్యనారాయణ, ఎం.విజయలక్ష్మి, ఎం. శ్రీనివాసరావు చాగల్లు, దారవరం, పశివేదల, ఊనగట్ల, నిడదవోలు తదితర ప్రాంతాల ధ్యానులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో లక్ష పత్రి పూజ



తాళ్లపూడి ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో లక్ష పత్రి పూజ నిర్వహిస్తున్న అర్చకులు

తాళ్లపూడి: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక ఉమా మహేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం లక్ష పత్రి పూజ నిర్వహించారు. ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో అర్చకుడు జంధ్యాల గంగాధరశాస్త్రి సారథ్యంలో ఆలయంలో లక్షపత్రి పూజ, ఉసిరి చెట్టు వద్ద పూజ నిర్వహించారు. అనంతరం కార్తిక వన సమారాధన నిర్వహించారు. వన సమారాధనలో ఆర్యవైశ్య ప్రముఖులు సింహాద్రి జనార్దనరావు, గోకవరపు బాబులు, కొండూరు ప్రసాదరావు, రాముడు, కంకిపాటి శ్రీనివాసరావు, అప్పన రత్నాజీ, మండలంలోని పలు గ్రామాల ఆర్య వైశ్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి 'మానవత ' సాయం

నల్లజర్ల: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని అచ్చన్నపాలేనికి సీదరాల సూరమ్మకు ఆదివారం మానవత స్వచ్ఛంద సంస్థ మండలశాఖ ఆర్థిక సాయం అందజేసింది. ఆ సంస్థ రూ.5వేలు, గ్రామస్తులు పాతూరి సత్యనారాయణ రూ.1000, పాతూరి రమేష్ రూ.500, పత్తిపాటి గంగారావు, కూచిపూడి సత్యనారాయణ రూ.500, ముళ్లపూడి చిరంజీవి అమ్మిరాజు రూ.500 మొత్తం రూ.8 వేలను అందజేశారు.

తాళ్లపూడిలో అంధ వృద్ధురాలికి..

తాళ్లపూడి: స్థానిక అంధురాలు, వంటరి వృద్ధురాలైన ఆరాధ్యుల సూర్య భాస్కరలక్ష్మి వైద్య ఖర్చులు, కుటుంబ పోషణ నిమిత్తం మానవత సేవా సంస్థ మండల శాఖ ఆదివారం ఆర్థిక సాయం చేసింది. ఆ సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్‌కుమార్ చేతుల మీదుగా రూ.6 వేలు అందజేశారు. కార్యక్రమంలో సనపల రాజశేఖర్, అప్పన హనుమంతరావు, వి.చంద్రయ్య, పెమ్మాడి దుర్గాప్రసాద్, కొప్పాక వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల హాల్టుల పునరుద్ధరణకు హైకోర్టులో వ్యాజ్యం

బుధవారం దాఖలుకు కొవ్వూరు రైల్వేస్టేషన్ పరిరక్షణ సమితి నిర్ణయం

కొవ్వూరు: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టులను పునరుద్ధరించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయాలని కొవ్వూరు రైల్వేస్టేషన్ పరిరక్షణ సమితి నిర్ణయించినట్టు సభ్యులు తెలిపారు. వచ్చే బుధవారం వ్యాజ్యం దాఖలు చేయడానికి వీలుగా అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసినట్టు చెప్పారు. కరోనాకు ముందు ఈ స్టేషన్‌లో ఆగే అన్ని రైళ్ల హాల్టులను పునరుద్ధరించాలని సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్ సాధన కోసం ఏడాదిగా తాము చేపట్టిన కార్యక్రమాలు, రైల్వే శాఖకు కొవ్వూరు నుంచి పంపిన వినతులు, ప్రజాప్రతినిధులకు పంపిన వినతిపత్రాలు ,ప్రజలు, విద్యార్థుల ద్వారా రైల్వే శాఖకు రాసిన ఉత్తరాల ఉద్యమం వంటి అంశాలను హైకోర్టుకు వివరించాలని నిర్ణయించామన్నారు. రిటైర్డు ఉపాధ్యాయుడు వీటీ విల్సన్ రాజు పేరుతో ఈ వ్యాజ్యం దాఖలు చేయాలని రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి నిర్ణయించినట్టు సభ్యులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి నలుగురికి గాయాలు

దేవరపల్లి: దేవరపల్లి వైపు నుంచి గోపాలపురం వైపు కూలీలతో వెళుతున్న ట్రాక్టర్ గోపాలపురం పొగాకు వేలం కేంద్రం వద్ద ఆదివారం రాత్రి బోల్తా పడింది. అతివేగంగా వెళుతున్న ట్రాక్టర్ అదుపు తప్పి సుమారు 10 అడుగుల దూరం దూసుకుపోయి రోడ్డు లంకలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ట్రక్కులో ఉన్న నలుగురు కూలీలు తీవ్రంగా గాయపడగా, పోలీసులు గోపాలపురం సామాజిక ఆసుపత్రికి తరలించారు.

భగవద్గీత పుస్తకాలతో తులాభారం

దేవరపల్లి: స్థానిక శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ మంటపంలో ఆదివారం గ్రామానికి చెందిన శ్రీకాకొళపు జయలక్ష్మిని పటికబెల్లం, భగవద్గీత పుస్తకాలతో కుటుంబ సభ్యులు తులాభారం వేసి మొక్కు చెల్లించుకున్నారు. ముందుగా శ్రీకాకొళను నాగయ్య గుప్తా, జయలక్ష్మి దంపతులు శ్రీవారికి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com